స్వచ్ఛమైన నీరు.. గరళమవుతున్న తీరు..

- జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుపాలు
- కలుషిత నీటితో నిత్యం అవస్థలు పడుతున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- మొద్దునిద్ర వీడాలంటూ ప్రజల ఆగ్రహం



ఉప్పల్ భరత్‌నగర్‌లో నెలల తరబడి రోడ్లపై పారుతున్న నీరు

ఉప్పల్: ఉప్పల్ నియోజవర్గం పరిధిలో జలమండలి అధికారులు మొద్దునిద్ర పోతున్నారు. ఒక పక్క ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటూ తెలంగాణ ప్రగతిని గొప్పగా ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నాలు చేస్తున్నా.. ఇక్కడ మాత్రం అధికారుల అలసత్వంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, కాప్రా జలమండలి డివిజన్ల పరిధిలో దాదాపు కాలనీల్లో, బస్తీల్లో తాగు నీరు వదిలితే చాలు దారులన్నీ జలమయంగా మారుతున్నాయి. ఈ తంతు రెండు సంవత్సరాలుగా కొనసాగుతోంది. తాగునీరు వచ్చిన రోజు దారులన్నీ జలమయం కావడమే కాకుండా రోడ్లు పాడై గుంతలు ఏర్పడుతున్నాయి. దానికితోడు చాలా కాలనీల్లో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. సమస్యను కార్యాలయానికి వచ్చి వివరించినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం తాగునీరు వృథా

న్యూవిజయపురి కాలనీ, భరత్‌నగర్, ఓల్డ్ భరత్ నగర్, రాఘవేంద్రానగర్ తదితర ప్రాంతాల్లో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. దాదాపు ప్రతి వాల్వు వద్ద నీటి లీకేజీలే దర్శనమిస్తున్నాయి. మరిన్ని కొన్ని ప్రాంతాల్లో గంటల తరబడి నీటి సరఫరాతో ఇళ్లలోని సంపులు నిండి రోడ్డుపై వరదలా పారుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదు. మిషన్ భగీరథ కింద కొన్ని ప్రాంతాల్లో కొత్త పైపులైన్లు వేసినా మరి కొన్ని అలాగే మిగిలి పోయాయి. నీటి ఒత్తిడి తట్టుకోలేని పైపులైన్లు పగిలిపోతున్నాయి. మరి కొన్ని చోట్ల వాల్వుల వద్ద త్రెడ్‌లు అరిగి పోయి తరచూ లీకేజీలు ఏర్పాడుతున్నాయి. దీంతో దాదాపు 40 శాతం వరకు ప్రతి రోజూ తాగు నీరు వృథా అవుతోందని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10 లక్షలపైనే జనాభా

జలమండలి 14 డివిజన్ పరిధిలో కాప్రా, ఉప్పల్ సర్కిళ్లు ఉన్నాయి. జనాభా దాదాపుగా 10 లక్షలకు పైనే ఉంటోంది. రెండు సర్కిళ్ల పరిధిలో కలిసి 77,640కి పైగానే నీటి కనెక్షన్లు ఉంటాయి. వీటికి అదనంగా మరో 40 శాతం వరకు అక్రమ నీటి కనెక్షన్లు ఉండవచ్చని అంచనా. దాదాపు 492 కిలో మీటర్ల మేర నీటి పైపులైన్లు విస్తరించి ఉన్నాయి. 20 వరకు రిజర్వాయర్లు ఉన్నాయి. దాదాపుగా 227 మంది ఉద్యోగులు జలమండలి కింద పని చేస్తున్నట్లు సమాచారం. ఇంత ఉన్నా కూడా ఎప్పటిలాగే లో ప్రెషర్ సమస్య, లీకేజీలు, పైపులు పగలడం వంటి సమస్యలను సమర్థవంతగా ఎదుర్కోవడంలో జలమండలి యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే చెప్పాలి.

తక్షణమే స్పందిస్తాం..



కలుషిత జలాలను కనిపెట్టడానికి ఒక యంత్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాం. ట్రయల్ రన్ సాగుతోంది. త్వరలో కలుషిత జలాలను అరికడతాం. ఎక్కడైనా లీకేజీలు, పైపులైన్లు పగలడం, వృథాగా తాగునీరు పోతున్నా నేరుగా తమకు సమాచారం ఇవ్వండి. తక్షణమే స్పందిస్తాం. ఇంకా ఏదైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 155313కు ఫిర్యాదు చేయండి.

\- సంతోష్, జలమండలి జనరల్ మేనేజర్

చెరువుల అభివృద్ధికి కృషి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



బోడుప్పల్‌లో ర్యాలీ

హబ్సిగూడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు కట్టపై ఊరూరా చెరువుల పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. మిషన్ కాకతీయ పథకంతో చెరువులు అభివృద్ధి చెందాయన్నారు. గతంలో అనుభవించిన లోతట్టు ముంపు ప్రభావిత ప్రజల కష్టాలకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేశామన్నారు. ఉప్పల్ డీసీ అరుణకుమారి, కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ నారాయణ, డీజీ పవన్, ఏఈ పృథ్వీ, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ ఈఈ నాగేందర్, డీఈ నాగమణి, ఏఈ సాయి కిరణ్, హార్టికల్చర్ మేనేజర్ మేధా, నర్సింగ్‌రావు, సుష్మ, ప్రాజెక్టు ఆఫీసర్ రమాదేవి, డీఈ చందన, శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎలక్ట్రికల్ డీఈ రవీందర్, బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, సుధాకర్, రఘుపతిరెడ్డి, ప్రవీణ్‌ముదిరాజ్, డాక్టర్ చారి, ముస్తాక్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో..

బోడుప్పల్: ఊరూరా చెరువుల పండగ కార్యక్రమంలో భాగంగా మేయర్ సామల బుచ్చిరెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు గురువారం బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయం నుంచి రా చెరువు కట్ట వరకు బతుకమ్మలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కట్ట మైసమ్మ తల్లికి పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. అనంతరం కార్పొరేటర్లు స్థానిక ప్రజలతో కలిసి బతుకమ్మ ఆడి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కాప్రా: ఊరూరా చెరువుల పండగను గురువారం కాప్రాలో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా చెరువు, చర్లపల్లి చెరువు వద్ద ఊరూరా చెరువుల పండగ కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, ఎం.కె.బద్రోద్దీన్, కొండల్‌గౌడ్ పాల్గొన్నారు.



చర్లపల్లి చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

క్లుప్తంగా...

రాచకొండ పోలీసుల స్పెషల్ డ్రైవ్



కుషాయిగూడ: రోజురోజుకూ రెచ్చిపోతూ తప్పించుకుని తిరుగుతున్న చైన్ స్నాచర్ల కోసం రాచకొండ కమిషనరేట్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న దుండగులు తమ వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా, తప్పుడు నంబర్ ప్లేట్లతో వాహనాలపై తిరుగుతున్నారనే సమాచారం మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మంగళవారం చేపట్టిన డ్రైవ్‌లో మొత్తం 14 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు కుషాయిగూడ పోలీసులు. ఇందులో ఆరుగురికి ఒక రోజు జైలు శిక్ష, జరిమానా, ముగ్గురికి రెండ్రోజుల పాటు సమాజ సేవ, మరో ఐదుగురికి కోర్టు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

చర్లపల్లి చెరువును సందర్శించిన మాజీ మేయర్



చర్లపల్లి చెరువు వద్ద ముదిరాజ్ సంఘం నేతల సమస్యలు తెలుసుకుంటున్న బొంతు రామ్మోహన్

కుషాయిగూడ: నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ గురువారం చర్లపల్లి చెరువును సందర్శించారు. చెరువులో తొలగిస్తున్న గుర్రెపు డెక్క పనులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘం నేతల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు బాల్‌రెడ్డి, విద్యాసాగర్, కనకరాజుగౌడ్, శ్రీకాంత్ యాదవ్, ప్రభుగౌడ్, ముత్యాలు, భానుచందర్, ముదిరాజ్ సంఘం నేతలు ఈగ సత్యనారాయణ, వి.బాబు, విజయ్‌కుమార్, గోపాల్, పాండు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన రమాదేవిమహిపాల్‌రెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.18 వేల చెక్కును గురువారం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి, కాటేపల్లి రవీందర్‌రెడ్డి, నాగిరెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారా తోరణం ప్రారంభం



కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని మంగాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం తోరణాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. ఆలయ ముఖద్వార తోరణం ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గూడారపు శ్రీనివాస్‌రెడ్డి, దాతలు తన్నీరు వెంకటేశ్వరరావు, చింతల కొండల్‌రెడ్డి, ఠాగూర్, విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాల అందజేత



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ శంకర్

మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపాలిటీ పరిధిలో పలు వీధి కుక్కలను దతత తీసుకున్న 24వ డివిజన్ కాలనీవాసులకు గురువారం 24వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి శంకర్, కమిషనర్ వంశీ చేతులమీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాలొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు శిబిరం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ నగర మేయర్ సామల బుచ్చిరెడ్డి కోరారు. గురువారం బోడుప్పల్ పెంటారెడ్డి కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడారు. ఈ నెల 13 వరకు కంటి వెలుగు శిబిరం అందుబాటులో ఉంటుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, స్థానిక కార్పొరేటర్ చీరల నర్సింహ, కాలనీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సాయిఎంక్లేవ్ వాసులు శివప్రసాద్, సురేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మౌలాలి: మౌలాలి డివిజన్ ఆడమ్స్ పాఠశాల వద్ద గురువారం నందికంటి శ్రావణ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఎంజార్జ్ ఫౌండేషన్ సంస్థ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. గుండె, లివర్, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు వెంకటేష్‌యాదవ్, వంశీ ముదిరాజ్, ఉమామహేశ్వరి, వినోద్‌యాదవ్, రామ్‌చందర్, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, నర్సింహ, కిరణ్, ముక్తార్, చక్రం, సలీమ్, అమిత్, సిద్దిక్, రుక్మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సాయం

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నర్సింహరావు కూతురు గీతాంజలి మెడిసిన్ సీటు సంపాదించి మొదటి ఏడాది పూర్తి చేసుకుంది. ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన ఫీజును గురువారం బీఎల్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థపకులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బండారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి చేతులమీదుగా విద్యార్థికి అందజేశారు. మొత్తం 5 సంవత్సరాల ఫీజును బండారి లక్ష్మారెడ్డి అందజేయడం అభినందనీయమని మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. బీఎల్‌ఆర్ ట్రస్ట్‌తో ఎంతోమందికి సేవా, సామాజిక కార్యక్రమాలను చేపడుతున్న లక్ష్మారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, బీఎల్‌ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు కటార్ల భాస్కర్, బాబు, నరేష్, అంజి, ప్రవీణ్, దీపక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆకుల రాజేందర్ జన్మదిన శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నరేందర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్వాల్ కానాజీగూడకు చెందిన రెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆకుల రాజేందర్ జన్మదిన వేడుకల్లో పాల్గొని పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రామచంద్ర ఎన్‌క్లేవ్‌లో

మల్కాజిగిరి: మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ జన్మదిన వేడుకలు రామచంద్ర ఎన్‌క్లేవ్‌లో అభిమానులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. శ్రీకాంత్, కుద్దూస్, వెంకటేష్, గఫూర్, అజయ్, పి.వెంకటేష్, వీరేశం, వాసుదేవరావు, నారాయణరెడ్డి ఉన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి మహాంకాళి అమ్మవారి ఆలయంలో గురువారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. నాలుగు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు యంత్ర, ధ్వజ స్తంభ ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, యజ్ఞ ఉద్వాసన, అన్న ప్రసాద కార్యక్రమం జరిగింది. శుక్రవారం 10.30 గంటలకు లక్ష కుంకుమార్చన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.





సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ 11వ డివిజన్ హేమానగర్‌కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, కార్పొరేటర్లు కొత్త శ్రీవిద్యా చక్రపాణిగౌడ్, బొమ్మకు సుగుణమ్మ, బాలయ్య, మాజీ ఎంపీపీ కొత్త చక్రపాణిగౌడ్, బొమ్మకు బాలయ్య, బీఆర్‌ఎస్ అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, రామకృష్ణ, గోవిందరాజు పాల్గొన్నారు.

నాలా పూడికతీత పనుల్లో వేగం పెంచండి

అల్వాల్: నాలా పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ సబితకిషోర్ అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని వెస్ట్ వెంకటాపురం రోడ్ నంబర్-10లో గురువారం చేపట్టిన నాలా పూడికతీత పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వర్షపు నీరు సజావుగా వెళ్లడానికి నాలా పూడికతీత పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ ఏసీపీ విజయశ్రీ, డీఈ కార్తీక్, ఏఈ అరుణ్, నాయకులు భాస్కర్, సంతోష్, లోకేష్, జనార్దర్, కిట్టు, ప్రభాకర్, మోసీన్, ముత్యాలు, మల్లేష్, రామకృష్ణ, శ్యామ్‌సుందర్, రఘుపతిరెడ్డి, లక్ష్మీ, కల్పన, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి



హబ్సిగూడలో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభోత్సవంలో రాగిడి లక్ష్మారెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ వెంకట్‌రెడ్డినగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడుగుంట్ల మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గురువారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ఉద్యమించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించే దిశగా ప్రతి కార్యకర్త శ్రమించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంటి ఆగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, చందుయాదవ్, వెంకట్ యాదవ్, వెంకటేష్‌యాదవ్, వంజరి సంతోష్, సాయిబాబా, రాజు, జాంగీర్‌బాబా, రాజేష్‌నాయక్, విష్ణుచారి, సురేష్, నారాయణ, సాయి, శ్రీకాంత్, రాజు, కిరణ్, కరుణాకర్, సతీష్, ఈశ్వర్, శివయాదవ్, శ్రావణ్‌కుమార్, పవన్, అజయ్, అమీర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌సీ సేవలు ఎనలేనివి



ఎన్‌ఎఫ్‌సీ దశాబ్ది ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శుక్లా

కుషాయిగూడ: అణు ఇంధన విభాగాలకు దేశవ్యాప్తంగా ఎన్‌ఎఫ్‌సీ అందిస్తున్న సేవలు ఎనలేనివని అటానమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు చైర్మన్ డాక్టర్ దినేష్ కుమార్ శుక్లా కొనియాడారు. ఎన్‌ఎఫ్‌సీ 51వ వార్షికోత్సవం సందర్భంగా ఐదు దశాబ్దాల ఎన్‌ఎఫ్‌సీ విజయాలను వివరిస్తూ రూపొందించిన బ్రోచర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శుక్లా మాట్లాడుతూ ఎన్‌ఎఫ్‌సీ సాధించిన విజయాలు, ప్రగతిని అభినందించారు. సంస్థ విజయాల వెనుక ప్రతి కార్మికుడు, ఉద్యోగి, సిబ్బంది పాత్ర ఉందని, వారి సేవలు మరువలేనివన్నారు.

లక్ష్యాన్ని అధిగమించాం..

రాజస్థాన్ కోటా, రావత్‌భాటాలో ఏర్పాటు చేస్తున్న నూతన ప్లాంట్‌కు అణు ఇంధన అవసరాలకు అనుగుణంగా తమ లక్ష్యాన్ని అధిగమించి అణుఇంధన ఉత్పత్తి చేసినట్లు ఎన్‌ఎఫ్‌సీ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ డాక్టర్ కోమల్ కపూర్ తెలిపారు. ఐదు దశాబ్దాలుగా ఎన్‌ఎఫ్‌సీ ఎన్నో విజయాలు సాధించిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిథాని లిమిటెడ్ సీఎండీ డాక్టర్ సంజయ్‌కుమార్ ఝా, ఎన్‌ఎఫ్‌సీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల హామీ ఏమైంది..?



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన రెండు పడకల గదుల నిర్మాణ హామీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని, కేవలం పార్టీ కార్యాలయాల నిర్మాణం పైనే దృష్టి సారించిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. అల్వాల్ సర్కిల్ ఏ-బ్లాక్ విభాగం ఆధ్వర్యంలో గురువారం అల్వాల్‌లో నిర్వహించిన దీక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓట్ల కోసం రెండు పడకల గదుల నిర్మాణం చేస్తామని, ప్రజలకు కాకమ్మ కథలు వినిపించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి రాగానే పరిపాలన భవనాలు, పార్టీ కార్యాలయాల నిర్మాణాల పైనే దృష్టి సారించారన్నారు. వేలాది మంది దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అతీగతీ లేదన్నారు. అల్వాల్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి 9 సంవత్సరాలు కావొస్తోందన్నారు. నేటికీ 9 ఇళ్లు కూడా నిర్మించలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అర్హులైన వారందరికీ రెండు పడకల గదులను కేటాయించాలన్నారు. లేదంటే కాంగ్రెస్ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్‌రెడ్డి, చంద్రశేఖర్, క్రిష్ణగౌడ్, శ్రీపాల్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులు, సంతోష్‌రెడ్డి, పవన్, ఓంకార్, పాండు, వీనస్‌మేరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గౌతంనగర్: నిరుద్యోగ యువత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని యాదవ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్నేహ చికెన్ సెంటర్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, నిర్వాహకులు నరేందర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657